ఏడాది కాలానికే కాంగ్రెస్ పాలనపై రాష్ట్రంలో తిరుగుబాటు మొదలైంది. సకలవర్గాలు సమ్మెబాట పట్టాయి. సంవత్సరంపాటు ప్రజాపాలన గొప్పగా సాగిందంటూ కాంగ్రెస్ పాలకులు సంబురాలు చేసుకున్నప్పటికీ ఆ సంతోషాల జాడలు ప్రజల్లో మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. పైగా 'మా సమస్యలను పరిష్కరించండి మహాప్రభో..' అంటూ అన్నివర్గాల ప్రజలు నిత్యం రోడ్డెక్కుతున్నారు. ప్రస్తుతం ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా వేలసంఖ్యలో కార్మికులు, చిరుద్యోగులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, పంచాయతీ కార్మికులు సమ్మెబాట పట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆశా కార్యకర్తలు ఏకంగా ఒకడుగు ముందుకేసి బస్సుయాత్రకు శ్రీకారం చుట్టారు.

*- భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ)*



భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు (ఫైల్)

# సకలం.. సమ్మెబాట

- ఏడాదికే కాంగ్రెస్ సర్కార్‌పై తిరుగుబాటు
- రోడ్డెక్కిన ఉద్యోగులు, కార్మికులు, రైతులు
- తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- కొంచెం కూడా స్పందించని ప్రభుత్వం



సీఎం రేవంత్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

అమలు సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఆ హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైంది. దీంతో కార్మిక సంఘాలు పెద్దఎత్తున నిరసన గళం వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్మికులు తాజాగా సమ్మె నోటీసు ఇచ్చి రెండ్రోజులు సమ్మెలో పాల్గొన్నారు. నెలనెలా వేతనాలు ఇవ్వలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ సర్కారు ఉండడంతో వ్యతిరేకత కూడగట్టుకున్నది. సర్వశిక్షా ఉద్యోగులు గత 20 రోజులుగా కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున సమ్మె చేస్తున్నారు. దీంతో 23 కస్తూర్బాగాంధీ స్కూళ్లు మూతబడ్డాయి. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు.

### రైతు రుణమాఫీ అంతంత మాత్రమే..

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైంది. రూ.2 లక్షల వరకు తీసుకున్న రైతు రుణాలను మాఫీ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి నేటికి 50 శాతం కూడా మాఫీ చేయలేదు. దీంతో రైతులు రోడ్డెక్కారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. రైతుభరోసా మీద కూడా విధివిధానాలు కూడా ప్రకటించకపోవడంతో యాసంగి పంట తర్వాత రైతులు మళ్లీ రోడ్డెక్కనున్నారు.

### కార్మికులకు అండగా ఎర్రజెండాలు..

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచిన ఎర్రజెండాలు.. అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకపోవడంతో కార్మికుల పక్షాన నిలబడుతున్నాయి. దీంతో సమ్మెలు చేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్నాయి. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఉపయోగంలేదని తాజాగా సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ఆరోపణ కూడా చేశారు. మరోవైపు పంచాయతీ కార్మికులకు అండగా ఉంటున్నామని సీపీఐ అనుబంధ సంఘమైన ఏఐటీయూసీ నాయకులు అంటూ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. మినీ అంగన్‌వాడీలకు జీతాలు ఇవ్వడం లేదని, మధ్యాహ్న భోజనవర్కర్లకు పెండింగ్ బిల్లులు ఇవ్వలేదని, సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించలేదని దుయ్యబడుతున్నారు.

### రుణమాఫీ వట్టిమాటే..



ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేకపోతున్నారు. రైతులకు రుణమాఫీ అన్నారు. 50 శాతం కూడా రుణమాఫీ అవ్వలేదు. రెండు లక్షలపైన ఉన్నవారికి కూడా చేస్తామన్నారు. రెండు లక్షలలోపు వారికే పూర్తిగా చెయ్యలేదు. మిగతా వాళ్లకి ఎప్పుడిస్తారో మరి? మూడు పంటలు దాటిపోయినా రైతుభరోసా ఇవ్వలేదు. నేటికీ ఎలాంటి ప్రకటన కూడా చేయలేదు. బీఆర్ఎస్ హయాంలో టంచన్‌గా ఖాతాల్లో పడేవి.

**– భూపతి రమేశ్, రైతు, రావికంపాడు**

### పిల్లల చదువులు పోతున్నా పట్టింపులేదు..



సర్వశిక్షా ఉద్యోగులు సమ్మె చేయడం ఇప్పటికీ 20 రోజులు అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదు. కస్తూర్బాగాంధీ పాఠశాలలు మూతబడ్డాయి. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు దగ్గరపడ్డాయి. విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయారు. భోజనం తిని కొంతమంది స్కూళ్ల వద్దనే ఉంటున్నారు. అలవిగాని హామీలు ఎందుకు ఇవ్వాలి. జిల్లాలో 23 స్కూళ్లు బంద్ అయ్యాయి.

**– మోహన్, సర్వశిక్షా అభియాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు**

### ఆరోగ్యం కాపాడేది మేమే..



గ్రామాల్లో ఎవరికి అనారోగ్యం వచ్చినా ఫస్ట్ చూసేది మేమే. కానీ మాకు పెండింగ్ వేతనాలు ఇవ్వడం లేదు. ఫిక్స్‌డ్ జీతం ప్రకటించలేదు. ఎన్నికల్లో మాత్రం హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. మేమూ మనుషులమే కదా? బతకాలంటే మాకు సరైన జీతాలు ఉండాలి. స్టేట్ మొత్తం కదిలింది. మాకు సీఐటీయూ, ఏఐటీయూసీ మద్దతు ఉంది.

**– ధరావత్ విజయ, శాంతినగర్, టేకులపల్లి మండలం**

---

## మండల పరిషత్ కార్యాలయంలో..
# దొంగలు పడ్డారు

- మైనార్టీలకు అందించే ఉచిత కుట్టు మిషన్లు చోరీ
- ఇంటి దొంగల ప్రమేయమా? బయటి వ్యక్తుల పనా?
- అధికారుల తర్జనభర్జన.. గోప్యత కోసం యత్నాలు
- మిషన్ల విలువ రూ.2.22 లక్షలు ఉంటుందని అంచనా



కుట్టు మిషన్లను లెక్కిస్తున్న సిబ్బంది

అశ్వారావుపేట, డిసెంబర్ 30: అశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయంలో దొంగలు పడ్డారు. నిరుపేద మైనార్టీ మహిళలకు ఉచితంగా అందించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిపెట్టిన కుట్టు మిషన్లు చోరీకి గురయ్యాయి. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కుట్టు మిషన్లను ఏడాది కాలంగా పంపిణీ చేయకుండా అధికారులు మూలనపడేశారు. అయితే, కార్యాలయంలో అడ్డుగా ఉన్నాయనే కారణంతో వాటిని వేరే గదిలోకి తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆ మిషన్లు చోరీకి గురైనట్లు అధికారులు గుర్తించారు. అయితే 'ఇందులో ఇంటి దొంగల ప్రమేయం ఉందా? లేక బయటి వ్యక్తుల పనా?' అనేది అంతు చిక్కడం లేదంటూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విషయాన్ని బయటకు పొక్కనీయకుండా గోప్యత పాటించడానికి తర్జనభర్జన పడుతున్నారు. చోరీకి గురైన మిషన్ల విలువ రూ.2.22 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిన గత కేసీఆర్ ప్రభుత్వం.. నిరుపేద మైనార్టీ మహిళల కోసం ఉచితంగా అందించడానికి కుట్టు మిషన్లు మంజూరు చేసింది. ఇవి గత ఏడాది జూలై నాటికి జిల్లాలకు చేరాయి. పంపిణీ బాధ్యతను ఎంపీడీవోలకు అప్పగించారు. అశ్వారావుపేట నియోజకవర్గానికి 83 కుట్టు మిషన్లు మంజూరు కాగా అవి స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరాయి. ఆ వెంటనే అసెంబ్లీ, తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడంతో వాటి పంపిణీకి బ్రేక్ పడింది. కుట్టు మిషన్లను అధికారులు మండల పరిషత్ కార్యాలయంలోనే భద్ర పరిచారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తి కాగానే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత మిషన్ల పంపిణీ అటకెక్కింది. దీంతో అవి తుప్పు పట్టే దశకు చేరుతున్నాయి.

### కేసీఆర్ ఫొటో ఉందని పంపిణీకి బ్రేక్..

ఆ కుట్టు మిషన్లపై అప్పటి సీఎం కేసీఆర్ ఫొటో ఉందన్న కారణంతోనే కాంగ్రెస్ పాలకులు వాటి పంపిణీకి బ్రేక్ వేశారు. అయితే ఒకవేళ వాటిని పంపిణీ చేయాలంటే ఆ మిషన్లపై కేసీఆర్ ఫొటో ఉండకూదని కాంగ్రెస్ పాలకులు భావించారు. ఈ క్రమంలోనే ఆ ఉచిత మిషన్లపై ఉన్న కేసీఆర్ ఫొటోలను తొలిగించినట్లు సమాచారం. ఇంతలో చోరీ ఘటన వెలుగులోకి రావడంతో దీనిని బయటకు పొక్కనీయకుండా గోప్యత కోసం అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు.

### 'పేట'కు 83 కుట్టు మిషన్లు..

నియోజకవర్గ వ్యాప్తంగా పేద మైనార్టీ మహిళలకు ఉచితంగా అందించడానికి గత కేసీఆర్ ప్రభుత్వం 83 కుట్టు మిషన్లు మంజూరు చేసింది. వీటిని నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు భద్రపరిచారు. అశ్వారావుపేటకు 37, దమ్మపేటకు 16, ములకలపల్లికి 13, చండ్రుగొండకు 16, అన్నపురెడ్డిపల్లి మండలానికి ఒకటి చొప్పున కుట్టు మిషన్లు మంజూరయ్యాయి. వీటిలో సుమారు రూ.2.21 లక్షల విలువైన 19 మిషన్లు, 49 మోటార్లు, 14, స్టాండ్లు, 17 టేబుళ్లు మాయమయ్యాయి.

### పంపిణీ జరుగుతుందా?

'నియోజకవర్గానికి మంజూరైన కుట్టు మిషన్ల పంపిణీ జరుగుతుందా?' అనే అనుమానం వ్యక్తమవుతోంది. 'చోరీకి గురైన మిషన్లు రికవరీ అయ్యే వరకు వీటి పంపిణీ సాధ్యమా?' అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ పంపిణీ చేయాల్సి వస్తే చోరీకి గురైన మిషన్లు ఏ మండలానికి తగ్గించాలో కూడా అధికారులకు అంతుబట్టడం లేదు. ఇప్పటికే లబ్ధిదారుల జాబితా కూడా ఉన్నతాధికారుల నుంచి ఎంపీడీవోలకు అందింది. ఆ జాబితా ప్రకారం పంపిణీ చేయడం సాధ్యమయ్యే పనికాదు. 'మరి అరకొరగా పంపిణీ చేసి చేతులు దులుపుకోవాలంటే మిగతా లబ్ధిదారులకు ఏం సమాధానం చెపుతారు?' అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇన్ని సమస్యలు ముందున్న ఈ పరిస్థితుల్లో 'పంపిణీ చేస్తారా? లేక పక్కన పడేస్తారా?' అనే ప్రశ్న లబ్ధిదారులను వెంటాడుతోంది.

### కుట్టు మిషన్లు తగ్గాయి..

నియోజకవర్గానికి 83 కుట్టు మిషన్లు మంజూరయ్యాయి. వీటిని భద్రపరిచే క్రమంలో కుట్టు మిషన్ల సంఖ్య తగ్గినట్లు గుర్తించాం. వీటి వివరాలను సేకరిస్తున్నాం. అతిత్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తాం. ఇందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం.

**–ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో**

---

## ఎస్ఎస్ఏ ఉద్యోగులకు బీఆర్ఎస్ నేతల సంఘీభావం



ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు రాకేశ్‌రెడ్డి, గుండాల కృష్ణ

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 30: సమగ్ర శిక్షా ఉద్యోగులు 20 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెకు బీఆర్ఎస్ నేతలు రాకేశ్‌రెడ్డి, గుండాల కృష్ణ సంఘీభావం ప్రకటించారు. ఖమ్మం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద కొనసాగుతున్న సమ్మెను సోమవారం వారు సందర్శించారు. అక్కడ నిరసన కార్యక్రమంలో ఉన్న ఉద్యోగులను కలిశారు. వారితో మాట్లాడి వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అనంతరం ఉద్యోగులు ఒంటికాలితో నడిచి నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

## న్యూఇయర్ వేడుకలకు పటిష్ట బందోబస్తు

### ఖమ్మం సీపీ సునీల్‌దత్



మామిళ్లగూడెం, డిసెంబర్ 30: నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ సునీల్‌దత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సున్నితమైన ప్రాంతాలు, ప్రార్థనా స్థలాలు, ప్రధాన రహదారులు, సినిమా థియేటర్లు, లకారం ట్యాంక్‌బండ్, వెలుగుమట్ల పార్కు తదితర పబ్లిక్ పార్కుల్లో పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువత ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌లను తగ్గించేందుకు ప్రధాన రహదారులపై వాహన తనిఖీలు నిర్వహిస్తామన్నారు. పటాకులు పేల్చడాన్ని నిషేధించాలని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. వేడుకల సందర్భంగా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని నూతన సంవత్సర మొదటిరోజు ఏ కుటుంబం విషాదకర ఘటనతో ఆరంభం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు, కార్లు ఇవ్వడం కారణంగా వారు మద్యం మత్తులో లేదా నిర్లక్ష్యంగా వాహనాలను నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. అందుకని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.


























